# నాటకమూ ఓ జీవితమే !

జీవితమే ఓ నాటకరంగం అన్నారెవరో. ఆ మాటను ఎవరూ కాదనలేరు.

అయితే, నాటకమూ ఓ జీవితమే.

మంచి రచయితలెవరూ జీవితాన్ని కాదని రచనలు చేయరు. జీవితాన్ని వివిధ కోణాల్లో స్పృశిస్తూ తమ రచనల్లో ప్రతిబింబించిన వారే ఉత్తమ రచయితలుగా నిలిచారు.



మానవ స్వభావంలోని వైవిధ్యాన్నీ వైరుధ్యాన్నీ కళ్లకు కట్టినట్టు చూపించిన రచయితలున్నారు. చిత్రకారులున్నారు. చిత్ర దర్శకులున్నారు. నాటక రచయితలూ దర్శకులూ ఉన్నారు.

జీవితాన్ని సజీవంగా చిత్రిస్తే, అది తమకు ప్రమాదకారి కానంతవరకూ ప్రభువులు మౌనంగానూ ఉంటారు. సందర్భం వస్తే ప్రశంసలూ కురిపిస్తారు.

ఏ రచన అయినా ఏ చిత్రం అయినా ఏ కళాఖండమైనా తమనూ తమ పాలననూ ఎద్దేవా చేస్తే ప్రభువులు కళ్ళెర్ర చేస్తారు. ఆ కళాకారులకు కళ్లేలు వేస్తారు. ఆ రచనల్ని నిషేధిస్తారు. ఇక ప్రభుత్వంతో పోరాడాలనీ, ప్రజలే ప్రభువులు కావాలనీ రాసినా పాటపాడినా భయపడిపోతారు. అలా రాసిన వాళ్లను జైళ్లల్లో పెట్టడానికీ, చంపించడానికీ వెనుకాడరు.

అదే తమ కొమ్ము కాసే వాళ్లనయితే అక్కున చేర్చుకుంటారు. అందలాలెక్కిస్తారు. అవార్డులిచ్చి సత్కరిస్తారు. చెడుకు వత్తాసు పలుకుతూ రాసినా, తమకు నష్టం కలిగించనిదైతే ఆ రచనను ప్రోత్సహిస్తారు.

కొందరు ప్రలోభపడి పోతారు. మరికొందరు ఎలాంటి ప్రలోభాలకూ లోనుకాకుండా తాము నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడతారు. ప్రాణాలను పణంగా పెడతారు. కష్టాలను కౌగలించుకుంటారు. తమ బాణీని జనం వాణిగా చేసుకుంటారు. జనం బాణీని తమ వాణిగా మార్చుకుంటారు. అందువల్లే వాళ్లు ప్రజల మనుషులుగా ప్రజా కళాకారులుగా నిలిచిపోతారు.

"మా కొద్దీ తెల్లదొరతనము" అని పాడిన కవిని బ్రిటిష్ పాలకులు చెరపెట్టకుండా ఉండలేకపోయారు. మాలపల్లి నవలను నిషేధించకుండా ఉండలేకపోయారు. అలాగే తెలంగాణా భూపోరాటాన్ని ప్రతిబింబించిన మా భూమి నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించారు.

విప్లవ రచయితల సంఘం ప్రచురించిన ఝంఝు కవితా సంపుటినీ మన పాలకులు నిషేధించారు. సృజన 1984 మేడే సంచికనూ నిషేధించారు. ప్రభుత్వ దానవత్వాన్నీ, ఖాకీల కిరాతకత్వాన్నీ నిరసిస్తూ జనాన్ని జాగృతం చేస్తూ వీధి నాటకాల్ని రాసి, నటించి ప్రదర్శించిన సఫ్దర్ హష్మీనీ పొట్టన పెట్టుకున్నారు.

"ఇది దొంగల రాజ్యం, ఇది దోపిడీ రాజ్యం" అంటూ పోరాట పాటలతో జనాన్ని చైతన్యవంతం

చేస్తున్న ప్రజానాయకుడు గద్దర్ తుపాకీ తూటాలను ఎదుర్కోకతప్పలేదు. సెటానిక్ వర్సెస్ నవల రాసిన సాల్మన్ రష్దీను ఖతం చెయ్యమని నాటి ఇరాన్ అధ్యక్షుడు ఖోమేనీ ఫత్వా జారీ చేశాడు. లజ్జ నవల రాసినందుకు తస్లీమా నస్రీన్ బంగ్లాదేశ్‌లో ఎన్నో విమర్శల్నీ ఇబ్బందుల్నీ ఎదుర్కొని స్వదేశాన్నే విడిచి వెళ్లిపోవాల్సి వచ్చింది.

ఏ దేశమేగినా ఏ రాష్ట్రమేగినా పాలకులంతా ఒకటే. ఒకే యూనిఫాంలో ఉండే పోలీసులే.

తమ మెల్ల కన్నునూ, ఎత్తు పళ్లనూ, స్ఫోటకం మచ్చల్నీ కప్పిపెట్టి 'సుందరాకారా' అని పొగుడుతూ పద్యం చెబితే ఆస్థాన కవి పదవి కట్టబెడతారు. నీదెంత చిందర వందర పాలనో చెప్పతరమా, నీదెంత సుందర ముఖారవిందమో పందినీ, గుడ్లగూబనూ అడగరాదా అని వెటకరిస్తే పాలకులు చిటపటలాడిపోతారు. పళ్లు పటపటకొరుకుతూ ఒళ్లు మరచిపోయి హుంకరిస్తారు.

హర్యానాలో కూడా నిన్నగాక మొన్న శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు గురుచరణ్‌సింగ్ తోహ్రా అలాగే భుజాలు తడుముకున్నాడు. హోషియాపూర్ జిల్లాలోని ఓ కాలేజీలో పంజాబ్ యూనివర్సిటీ యువజనోత్సవ సభకు ఆయన అధ్యక్షత వహించాడు. యువజనోత్సవం సందర్భంగా డిఎవి కాలేజీ విద్యార్థులు గురుశరణ్‌సింగ్ రాసిన 'ఓ కుర్చీ- ఓ ఫ్రంట్-నరకంలో ప్రజలు' నాటకాన్ని ప్రదర్శించారు. గురుశరణ్‌సింగ్ హర్యానాలో ప్రముఖ వ్యంగ్య నాటక రచయిత. దశాబ్దాలుగా సాంఘిక, రాజకీయ సమస్యలపై ఎన్నో నాటకాలు రాసి ఆడించాడు. తనను చంపేస్తామంటూ కొందరు మిలిటెంట్లు బెదిరించినా ఆయన భయపడలేదు సరికదా మరింత ఘాటుగా రచనలు చేశాడు. భింద్రన్‌వాలేను ప్రధానపాత్రగా చేసి ఆయన రాసిన వ్యంగ్య నాటకం ఎంతో ప్రసిద్ధిపొందింది. అలాంటి సాహసి, రాజకీయ వ్యంగ్య నాటకం "ఓ కుర్చీ - ఓ ఫ్రంట్-నరకంలో ప్రజలు" కాలేజీ కుర్రవాళ్ళు ప్రదర్శిస్తుంటే తోహ్రాగారి ఒంటికి ఉప్పూకారమూ రాసుకున్నట్టయింది. నాటకంలోని 'ఓ కుర్చీ' తనదే అనిపించి భుజాలు తడుముకున్నాడు. "ఓ ఫ్రంట్" తన పార్టీనే అనుకుని జడుసుకున్నాడు. "నరకంలో ప్రజలు" తమ కారణంగా కీడు జరిగిన వాళ్లేమోనని అనుమానించాడు.

ప్రదర్శనకు ముందు ఆ నాటకం నేటి రాజకీయ పరిస్థితికి అద్దం పట్టిందని ఆ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ మెచ్చుకున్న విషయం కూడా తోహ్రా మరచిపోయాడు. "ఏంటా నాటకం" అని తోహ్రా ఒక్క అరుపు అరచి, రెండు గంతులేసి, వేదిక ఎక్కేసి మైకు పట్టుకున్నాడు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తూనే ఉన్నారన్నాడు. ఆఖరికి యూనివర్సిటీల్లోకీ కాలేజీల్లోకీ కూడా ప్రవేశించి విద్యార్థుల మనసుల్ని కలుషితం చేసేస్తున్నారని కేకలేశాడు. విశ్వవిద్యాలయం యువజనోత్సవం సందర్భాన్ని ఆయనగారు మరిచిపోయి రాజకీయ ఉపన్యాసం దంచేశాడు.

ఇలాంటి నాటకాల్ని ప్రదర్శించడానికి వీల్లేదన్నాడు. నోటి మాట నిషేధాన్ని విధించి పారేశాడు. తోహ్రాగారి ఎర్రబడిన మొహం చూసి ఉత్సవ నిర్వాహకుల మొహాలు తెల్లబోయాయి,

"కడలి తరగలనాపగలవా భడవా ఓకాన్యూట్" అని మహాకవి శ్రీశ్రీ అనలేదూ.

బహుశా తోహ్రా ఉదంతం ఆధారంగా గురుశరణ్‌సింగ్ మరో రాజకీయ వ్యంగ్య నాటకం రాయడానికి పూనుకునే ఉంటాడు.

ప్రజా గళాలనూ ప్రజా కలాలనూ ఏ ప్రభువూ ఎల్లకాలమూ ఆపలేదు. ఇది చరిత్ర చెప్పే సత్యం.

వార్త దినపత్రిక, 5-12-97